


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 23-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక : 06 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఘోర రోడ్డు ప్రమాదం

### డిటీఓ పైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్.!




**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి (డిటీఓ) వెంకన్నను బొగ్గు టిప్పర్ లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయం ఎదుట వెంకన్న తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## టీ కాంగ్రెస్‌లో కీలక పరిణామం..

## పటాన్‌చెరు నుంచి బరిలో జగ్గారెడ్డి?




**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు రంజుగా మారుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండున్నరేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ పోటీ కోసం నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీనియర్లు రాజకీయం సాగిస్తుంటే తమ వారసుల కోసం రూట్ క్లియర్ చేసే పనిలో మరికొంత మంది బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ఆసక్తిని రేపుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సరికొత్త వ్యూహంతో బరిలోకి దిగేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పటాన్‌చెరు నుంచి బరిలోకి?:

తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న జగ్గారెడ్డి గత కొంత కాలంగా చేస్తున్న రాజకీయం సంగారెడ్డి జిల్లాలోనే కాకుండా తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాశంగా మారుతోంది. తన సొంత గడ్డ సంగారెడ్డి నియోజకవర్గాన్ని వదిలి ఈసారి పటాన్‌చెరు అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## నీట్ రీ ఎగ్జామ్‌లో మళ్లీ దగా

### బీహార్‌లో 'సాల్వర్ గ్యాంగ్' గుట్టురట్టు..




**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ వైద్య విద్యా ప్రవేశ పరీక్షల వివాదాలు సమిసిపోయి.. మళ్లీ పరీక్ష నిర్వహించింది ఎన్టీఏ. అయితే దురదృష్టవశాత్తు ఈ రీ ఎగ్జామ్‌లోనూ అక్రమార్కులు తమ పంథా మార్చుకోలేదు. బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహించిన పకడ్బందీ తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

### 6 రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!




# 'ఏడు జన్మలెత్తినా ఏం చేయలేవు'

## డిప్యూటీ సీఎం పవన్‌పై మాజీమంత్రి అంబటి ఫైర్

**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రతి విషయంలోనూ పవన్ ప్రజలను, బాధితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వం సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి న్యాయం చేస్తామని చెబుతుంటే.. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏమో సాయికృష్ణను ఒక క్రిమినల్ అని మాట్లాడుతున్నారని అన్నారు.దే సమయంలో జనసేన నేత సామినేని ఉదయభాను సాయికృష్ణ తల్లిని ఓదార్చేందుకు వెళ్లి.. పవన్ కళ్యాణ్ పంపిస్తేనే వచ్చామని చెబుతున్నారు. అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే తెలియాలి అని అన్నారు. వైసిపి నేతలను తాటతీస్తామంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి మండిపడ్డారు.




# రైతులకు తీపికబురు

## ఒకే విడతలో 'రైతు భరోసా' పంపిణీ



- ఒకేసారి రైతు భరోసా
- జూన్ 30న నిధుల విడుదల
- రూ.9 వేల కోట్ల జమ
- 73 లక్షల రైతులకు లబ్ధి
- ఒకే విడతలో చెల్లింపులు
- సన్న రైతులకే ప్రాధాన్యం
- ఏడున్నర ఎకరాలకే పరిమితి?
- సాగు రైతులకే సాయం
- శాటిలైట్ సర్వేతో ఎంపిక
- పట్టాదారులకు కొత్త నిబంధనలు
- కౌలు రైతులపైనా దృష్టి
- ఖరీఫ్‌కే భరోసా?
- పంట ఆధారంగానే చెల్లింపు
- రైతులకు పెట్టుబడి ఊరట
- వ్యవసాయ శాఖ భారీ ప్రణాళిక

**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** ప్రభుత్వానికి ఆర్థిక భారమైనా రైతులకు భరోసా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగనున్న బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభంకావడంతో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కొత్త పట్టా పాసు బుక్ వివరాలను సీసీఎల్ఏ నుంచి ప్రభుత్వం తెప్పించుకుంది. మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాలో రూ.9 వేల కోట్లు జమ చేసేందుకు పక్కాగా ప్లాన్‌చేస్తోంది. యాసంగిలో రెండు ఎకరాలకే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దాని నుంచి బయటపడేందుకు ఒకేసారి జమ చేస్తే బాగుంటుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. ఇక నిధుల కొరత ఏర్పడితే మొదట ఎకరం చొప్పున 9 రోజుల్లో పూర్తిగా పంపిణీ చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖలో టాక్ వినిపిస్తోంది.

మిగతాది 2 లో..

## ఇందిరమ్మ రాజ్యం వచ్చింది..

## ఇంటింటా సంక్షోభం తెచ్చింది




**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** ఇందిరమ్మ రాజ్యం తెలంగాణలోకి వచ్చి ఇంటింటా సంక్షోభం నింపిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తీసుకున్న పంటల కొనుగోలు తాలూకు నిర్ణయం రాష్ట్ర రైతాంగానికి ఉరితాడుగా మారబోతుందని కేటీఆర్ అన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్‌ది సుతిలేని సంసారం

### ఎంపీ రఘునందర్ రావు హాట్ సెటైర్లు



ఇది కద నిజం
మంగళవారం 23-06-2026

# రైతులకు తీపికబురు..ఒకే విడతలో 'రైతు భరోసా' పంపిణీ

మొదటి పేజీ తరువాయి

ఏడున్నర ఎకరాలకే..

మరోవైపు యాసంగి సీజన్‌లో భరోసా తమే సాగు అవుతాయి. అయితే వరి తర్వాత పెద్ద మొత్తంలో సాగు చేసే పంట పత్తి. ఇది వానాకాలంలోనే వేయగా జనవరి వరకు పూర్తవుతుంది. రెండోసారి రబీలో సాగు చేయరు. అలాంటప్పుడు పత్తికి పెట్టుబడిసాయం ఎందుకని ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో రైతు భరోసా ఒక ఖరీఫ్‌సీజన్‌కే పంపిణీ చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖలో ప్రచారం జరుగుతోంది. ధనవంతులైన రైతులకు కూడా భరోసా ఇస్తే ప్రభుత్వానికి ప్రయోజనం లేదని, సన్న, చిన్న కారు రైతులకే వేయాలనే అంచనాకు వచ్చినట్టు సమాచారం. వచ్చే వానాకాలం 7.20 గుంటల వరకు పరిమితి పెట్టి ఆ లోపు భూమి కలిగిన వారికే భరోసా సాయం అందజేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాల భూమి ఉంటే అందులో 20 నుంచి 25 లక్షల ఎకరాల భూమి రియల్ ఎస్టేట్, కాలువలు, కుంటలు, బీడు భూములు, సాగుకు పనికిరాని పడావు భూములున్నాయి. వీటిని భరోసా జాబితా నుంచి ప్రభుత్వం ఇప్పటికే తొలగించనుంది.

ఒకే పంటకు సాయం

రైతు భరోసా నిధులు సాగు చేసే రైతులకే పంపిణీ చేయాలని లక్ష్యంగా రేవంత్‌ప్రభుత్వం ప్లాన్‌చేస్తోంది. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం సాగు అంటే తెలియని పట్టాదారు పాస్ బుక్ కలిగినవారందరికీ అప్పన్నంగా పెట్టుబడి సాయం ఖాతాలో జమ చేసింది. అయితే ఇకనుంచి ప్రజల సొమ్ము వృథా కాకుండా పంట సాగుచేసే వారికే భరోసా సాయం అందించాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. అవసరమైతే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేలు పంపిణీ చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి తిరుగు ఉండదని, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించవచ్చనే అంశం ఇటీవల జరిగిన మంత్రి వర్గం సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం. 10 ఎకరాలకుపైగా భూమి ఉన్నవారికి పెట్టుబడి సాయం అందిస్తే ఎలాంటి ఉపయోగం లేదని, పేద, మధ్యతరగతి రైతులకు వేస్తే అన్ని రకాలుగా ప్రయోజనం ఉంటుందని డిస్కస్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. అదే విధంగా కౌలు రైతులను ఆదుకునేందుకు చట్టం తీసుకొచ్చి, వారికి భరోసా ఇచ్చే అంశంపై పరిశీలనచేయాలని ఒకరిద్దరు మంత్రులు ముఖ్యమంత్రి ముందు ప్రపోజల్ పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.



శాటిలైట్ సర్వేనే కీలకం

ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయం శాటిలైట్ చిత్రాల ఆధారంగా ప్రతి గ్రామంలో సర్వే నెంబర్ వారీగా పంట విస్తీర్ణం లెక్కించేందుకు స్విట్జర్లాండ్ దేశానికి చెందిన సార్ మ్యాప్ సంస్థతో ఒప్పందం చేసుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు వివరాలను సేకరించింది. 95 శాతం ఎలాంటి పంటలు వేశారో గుర్తించింది. శాటిలైట్ సర్వే చేసిన వివరాలను పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాకు ఐదు గ్రామాలను ఎంపికచేసి ఏఈవోలతో సర్వే చేయించగా ఒకే విధంగా వచ్చింది. దీంతో ఇకనుంచి శాటిలైట్ సర్వే ఆధారంగానే పెట్టుబడి సాయం అందించనుంది. ఈ సర్వే ద్వారా ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం అందజేయవచ్చు. సాగు చేసిన భూముల ఆధారంగా విత్తనాలు, ఎరువులు ఎంత కావాలో ముందుస్తుగా సిద్ధం చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పంట సాగు చేసిన రైతులకే అందుతుందని ప్రభుత్వం బలంగా భావిస్తోంది.

# ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఇంటింటా సంక్షోభం తెచ్చింది

మొదటి పేజీ తరువాయి



వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో సోమవారం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ఏ పల్లెకు పోయినా ఒకటే ఆవేదన ఆక్రందన కనిపిస్తోందన్నారు. పదేండ్ల తెలంగాణ రెండున్నర ఏండ్లలో సంక్షోభంలోకి జారుకున్నదన్నారు. కాంగ్రెస్ ని నమ్మి ఓటేస్తే అన్ని వర్గాలను అడ్డగోలుగా మోసం చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రానికి ఏం లబ్ధి జరిగింది, ఎన్ని కొత్త పథకాలు వచ్చాయని ప్రశ్నించారు.

ాశ్రీంశీ =ఖుస - టాస్క్ ద్వారా ఉచిత శిక్షణ..జిల్లా కలెక్టర్ ప్రకటన

ఒకవైపు ఎరువుల కొరత, విత్తనాల కొరత, కరెంటు కోతలు, కొత్తగా రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్తు కుట్రలు, రైతుబంధు ఎగవేత, రైతుబీమా రద్దు ఇలా దుర్మార్గంగా సర్కార్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆనాడు రైతుబంధు మేమెందుకు ఎగగొడతామని, ఇప్పుడు ఎగగొట్టే కుట్రలు చేస్తున్నారని సీరియస్ అయ్యారు. వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడుకి, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాదంటూ వ్యాఖ్యానించారు. మా కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన ఒక్కొక్కడిని రిటైర్ అయినా, పారిపోయినా, సప్త సముద్రాలు దాటినా లాక్కొచ్చి నిలబెడతానని హెచ్చరించారు. తెలంగాణలో ఇవాళ ఎవరిని కదిలించినా ఒకటే మాట..మళ్లీ కేసీఆరే రావాలి అంటున్నట్లు స్పష్టం చేశారు కేటీఆర్. కాగా ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి సంబంధించిన అంశాల పైన కూడా పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ ఒక ప్రజంటేషన్ ద్వారా వివరాలు అందజేశారు.

# 'ఏడు జన్మలెత్తినా ఏం చేయలేవు'.. డిప్యూటీ సీఎం పవన్‌పై మాజీమంత్రి అంబటి ఫైర్

మొదటి పేజీ తరువాయి



"రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడొచ్చా? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? అసలు ఎవరు గూండాలు? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు. "నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం" అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని గుర్తు చేశారు. సాయికృష్ణ కేసులో ఒక అధికారి విచారణ జరుపుతుండగా హఠాత్తుగా 'సిట్' వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకనే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూ.. మరోవైపు ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నీట్ రీ ఎగ్జామ్‌లో మళ్లీ దగా

## బీహార్‌లో 'సాల్వర్ గ్యాంగ్' గుట్టురట్టు..

## 9 మంది నకిలీ అభ్యర్థులతో సహా 30 మంది అరెస్ట్



**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ వైద్య విద్యా ప్రవేశ పరీక్షల వివాదాలు సమిసిపోయి.. మళ్లీ పరీక్ష నిర్వహించింది ఎన్టీఏ. అయితే దురదృష్టవశాత్తు ఈ రీ ఎగ్జామ్‌లోనూ అక్రమార్కులు తమ పంథా మార్చుకోలేదు. బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహించిన పకడ్బందీ తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. అసలైన విద్యార్థులకు బదులుగా పరీక్షలు రాసేందుకు రంగంలోకి దిగిన 'సాల్వర్ గ్యాంగ్' (నకిలీ అభ్యర్థుల ముఠా) నెట్‌వర్క్‌ను జిల్లా యంత్రాంగం, పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. వివిధ పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్, ఐడెంటిటీ వెరిఫికేషన్ సమయంలో దొరికిపోయిన 9 మంది నకిలీ అభ్యర్థులు సహా ఈ మోసంతో సంబంధం ఉన్న మొత్తం 30 మందిని అధికారులు శనివారం అరెస్ట్ చేశారు.

లఖిసరాయ్ జిల్లాలోని వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో పక్కా సమాచారంతో అధికారులు ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. కేఆర్కే హైస్కూల్ పరీక్షా కేంద్రం నుంచి ఒకరు, కేంద్రీయ విద్యాలయ కేంద్రం నుంచి అత్యధికంగా ఏడుగురు, అలాగే హసన్‌పూర్ స్కూల్ పరీక్షా కేంద్రం నుంచి మరొక నకిలీ అభ్యర్థిని అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన ఈ తొమ్మిది మంది నిందితులు బీహార్‌లోని విభిన్న జిల్లాలకు చెందిన వారని, అసలు అభ్యర్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని, వారి స్థానంలో పరీక్ష రాయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

కేవలం పరీక్ష రాస్తున్న వారినే కాకుండా, కేంద్రాల వెలుపల ఉంటూ వారికి సాంకేతిక సాయం అందిస్తున్న, అలాగే అభ్యర్థులను చేరవేస్తున్న ముఠా సభ్యులపై కూడా పోలీసులు ఉక్కుపాదం మోపారు. మాల్‌ప్రాక్టీస్, పరీక్షా మోసాలకు సహకరించిన మొత్తం 21 మందిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకోగా.. ఈ ముఠా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ప్రస్తుతం లఖిసరాయ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ప్రభాకర్ కుమార్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శివం కుమార్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిందితులను రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. "నీట్ పునఃపరీక్షలో అక్రమాలకు పాల్పడుతూ 30 మంది దొరికిపోయారు. అందులో 9 మంది ఒకరి బదులు మరొకరు ఎగ్జామ్ రాస్తుండగా.. 21 మంది వీరికి వ్యూహాత్మకంగా సహకరించినట్లు తేలింది" అని ఎస్డీపీఓ శివం కుమార్ ధృవీకరించారు.

విచారణలో నిందితులు వెల్లడించిన వివరాల ఆధారంగా లఖిసరాయ్ జిల్లా వ్యాప్తంగా, పొరుగు జిల్లాల్లోనూ ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌ను జిల్లా కలెక్టర్ శైలేంద్ర కుమార్, ఎస్పీ ప్రేరణా కుమార్‌లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలూ కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఈ ముఠా వెనుక కొంతమంది కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, విద్యాశాఖ అధికారుల హస్తం కూడా ఉండవచ్చని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, పూర్తి నెట్‌వర్క్ వివరాలను త్వరలోనే మీడియాకు అధికారికంగా వెల్లడిస్తామని యంత్రాంగం పేర్కొంది.

# టీ కాంగ్రెస్‌లో కీలక పరిణామం.. పటాన్‌చెరు నుంచి బరిలో జగ్గారెడ్డి?

మొదటి పేజీ తరువాయి




ఇదే విషయమై జగ్గారెడ్డి ఇటీవలే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠాన పెద్దల వద్ద తన మనసులోని మాటను సైతం బయటపెట్టినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

సంగారెడ్డి బరిలో జగ్గారెడ్డి సతీమణి:

1986లో మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జగ్గారెడ్డి.. 2004, 2009, 2018లో సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గం విషయంలో తన మనసు మార్చుకున్నారు. సంగారెడ్డిలో తాను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయనని ఈ ఏడాది ప్రారంభంలో శపథం చేశారు. నాలుగు రోజుల క్రితం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి నేను కాదు నా సతీమణి నిర్మలా జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటారని ఇందులో ఎలాంటి సందేహం లేదని మరోసారి కుండబద్దలు కొట్టారు. నిర్మల ప్రస్తుతం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమె జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కూడా సేవలందించారు. అయితే తన సతీమణిని సంగారెడ్డి నుంచి బరిలోకి దింపి తాను పటాన్ చెరుపై దృష్టి సారించే వ్యూహంతో జగ్గారెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పటాన్‌చెరులో మూడుముక్కలాట:

జగ్గారెడ్డి పోటీపై ప్రచారం ఇలా జరుగుతుంటే పటాన్‌చెరు రాజకీయంలో ఇప్పటికే మూడుముక్కలాట హైవోల్టేజ్ క్రియేట్ చేస్తోంది. ఇక్కడ హ్యాట్రిక్ విక్టరీతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఉండగా, కాంగ్రెస్ పార్టీలో కాటా శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్ ఇద్దరు బలమైన ఆశావహులుగా ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా కాటా శ్రీనివాస్ వర్గంతో పొసగకపోవడంతో ఆయన తిరిగి బీఆర్ఎస్‌కు వెళ్లిపోయారనే టాక్ ఉంది. ఈ క్రమంలో ప్రచారం జరుగుతున్నట్లుగా జగ్గారెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గంపై నిజంగానే దృష్టి సారించారా? రాబోయే రోజుల్లో జగ్గారెడ్డి వ్యూహం, సమీకరణాలు ఎలాంటి మలుపులు తిరుగబోతున్నాయి అనేది తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ రేపుతోంది.

# ఘోర రోడ్డు ప్రమాదం.. డిటీఓ పైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్.!

మొదటి పేజీ తరువాయి




ఈ సమయంలో వేగంగా వచ్చిన బొగ్గు టిప్పర్ అదుపుతప్పి అధికారుల వైపు దూసుకెళ్లింది. టిప్పర్ బలంగా ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు ఆయన మృతదేహం నుజ్జునుజ్జయ్యిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కాగా, వెంకన్న కేవలం 15 రోజుల క్రితమే బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో ఉండగానే ఆయన మృతి చెందడం జిల్లా అధికార వర్గాలను, రవాణా శాఖ సిబ్బందిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన.. 6 రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!

**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న ఆరు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి, రాయలసీమ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా జూన్ 27 వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయని తెలిపింది. తెలంగాణలో మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు సూచించారు.


అటు ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. పిడుగుపాట్లు సంభవించే ప్రమాదం ఉన్నందున వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్స్ సమీపంలో ఉండవద్దని ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాల విస్తరణతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం ప్రారంభమైనట్లు కనిపిస్తోందని, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గి ప్రజలకు ఉపశమనం లభించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఘోరం.. వారం వ్యవధిలో ఆలయంలో రెండు భారీ స్కామ్‌లు!

**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో టికెట్ల గోల్‌మాల్ కలకలం రేపుతోంది. అమ్మవారి ఆదాయానికి గండి కొడుతూ, భక్తులను మోసం చేస్తున్న అక్రమార్కుల గుట్టు ఒక్కొక్కటిగా రట్టవుతోంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి రెండు పెద్ద ఘటనలు వెలుగుచూడటంతో ఆలయ ఈవో శీనా నాయక్ సీరియస్ అయ్యారు. ఈవో ఫిర్యాదు మేరకు స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

తాజాగా నిన్న ఆలయంలో టికెట్ల పంచింగ్ దగ్గర పెద్ద మోసం వెలుగుచూసింది. రూ. 100 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు దర్శనానికి వెళ్లే సమయంలో వాటిని పంచింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే, అక్కడ విధుల్లో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చింతాడ సాయి, మరో మహిళా ఉద్యోగి కలిసి సుమారు 70 నుంచి 80 టికెట్లను పంచింగ్ చేయకుండా దాచిపెట్టారు. ఈ టికెట్లను మళ్లీ అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనేది వీరి ప్లాన్. దీనిని గమనించిన ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వెంటనే అలర్ట్ అయి, ఆ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తనిఖీ చేయగా పంచింగ్ చేయని టికెట్లు బయటపడ్డాయి. వెంటనే ఈ సమాచారాన్ని ఈవోకు చేరవేయగా.. టెంపుల్ పోలీస్ సిబ్బంది నరసింహారావు, జగదీష్‌లు నిందితులను పట్టుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఈవో శీనా నాయక్ ఆ ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇలాగే ఈ నెల 14వ తేదీన కూడా ఆలయంలో అనధికార దర్శనాలు చేయిస్తున్న దళారీ గుట్టు రట్టయింది. గతంలో దుర్గమ్మ ఆలయంలో హోంగార్డ్‌గా పనిచేసిన చంద్రశేఖర్ అనే వ్యక్తి.. దళారీగా మారి భక్తులను నిలువునా ముంచాడు. ఏకంగా 50 మంది భక్తుల దగ్గర తలా రూ. 500 చొప్పున మొత్తం రూ. 25,000 వసూలు చేసి అక్రమంగా దర్శనాలు



చేయిస్తుండగా ఈవో శీనా నాయక్ స్వయంగా రంగంలోకి దిగి అతడిని పట్టుకున్నారు. ఈవో ఫిర్యాదుతో స్పందించిన సీపీ రాజశేఖర్ బాబు.. హోంగార్డ్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. గతంలో కూడా అమ్మవారి ఆలయంలో నకిలీ రూ. 500 టికెట్ల వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే అప్పట్లో నిందితులపై అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని వదిలేశారని, ఆ ఉదాసీనత వల్లే ఇప్పుడు సిబ్బంది, దళారీలు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారని భక్తులు, స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా నిందితులపై కఠిన చర్యలు తీసుకుని ఆలయ పవిత్రతను కాపాడాలని వారు కోరుతున్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌ది సుతిలేని సంసారం ఎంపీ రఘునందర్ రావు హాట్ సెటైర్లు

**న్యూస్ డెస్క్, 22 జూన్ (ఇది కద నిజం):** తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కంకణం కట్టుకున్నాడని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. ఇవాళ ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెట్రో ఫేజ్-1 టేకోవర్‌లో భారీగా అవకతవకలు జరగాయని.. వాటిపై విచారణ జరిపి ఎక్కడ తనపై కేసులు పేడతారేమోనని సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ఐఆర్ఎఫ్సి రుణం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పూచీకత్తుతోనే వచ్చిందని అన్నారు. అలాంటప్పుడు మెట్రో ఫేజ్-2 పనులకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆయన సూటిగా తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన.. సుతి లేసి సంసారంలా ఉందని ఫైర్ అయ్యారు. మంత్రులు, ముఖ్యమంత్రి మాటలను అసలు వినడం లేదని అందుకే రేవంత్ రెడ్డి తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని రఘునందర్ రావు అన్నారు.

# స్కూళ్లలో ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలి: బీఆర్ఎస్వీ డిమాండ్



ఇది కద నిజం: జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లలో విచ్చల విడిగా వసూలు చేస్తున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. ఫీజుల నియంత్రణ విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఘోరంగా విఫలమైందని, కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలనే ఆలోచనను మానుకోవాలని, విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా రాష్ట్రంలో ఉన్న 27 వేల పాఠశాలలను 4 వేలకు కుదిస్తామనడం ముఖ్యమంత్రి మూర్ఖత్వపు ఆలోచన అని జంగయ్య ధ్వజమెత్తారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకొని, ప్రభుత్వ బడుల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో విద్యార్థులకు అందాల్సిన రూ. 10 వేల కోట్లకు పైగా ఫీజు రీఇంబర్స్మెంట్ పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకపోతే భవిష్యత్తులో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జుబేర్, కృష్ణ, అలీ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసంఘక శక్తులను అడ్డుకుంటాం

## - బాణావత్ బాలు నాయక్ (టీఆర్ఎస్)




ఇది కద నిజం:అసాంఘిక శక్తులను పాల్పడే వ్యక్తులను టిఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన అడ్డుకుంటుందని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్చార్జి బాణావత్ బాలునాయక్ అన్నారు ఆదివారం నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని టిఆర్ఎస్ జండాను ఆవిష్కరించారు గతంలో ఇక్కడ ఉన్న టిఆర్ఎస్ జండాను కొందరు అసాంఘిక శక్తులు పాల్పడి దిమ్మెను కులగొట్టడంతో అదే స్థలములో కొత్త దిమ్మె ఏర్పాటు చేసి జెండాను కార్యకర్తల తో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో దేశంలో ఎవరు ఎక్కడైనా పోటీ చేసే అధికారం బి.ఆర్ అంబేద్కర్ అవకాశాన్ని కల్పించారన్నారు నియోజకవర్గంలో కొందరు నాయకులు గిరిజన నాయకులకు ఎదగనీయకుండా అసాంఘిక శక్తులు పాల్పడుతున్నారని వారిని తగిన బుద్ధి గిరిజన నాయకులు ఎలక్షన్లో ఓట్ల రూపంలో బుద్ధి చెప్తారు అన్నారు ఎన్ని శక్తులు అడ్డొచ్చినా రాష్ట్రంలో టిఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చి ప్రజల ఆశల మేరకు పనిచేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో వారి వెంట తెలంగాణ రక్షణ సేన నాయకులు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ



ఇది కద నిజం, రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం రాయల్ హయత్ కన్వెన్షన్లో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ సభ్యురాలు ఎ. సదాలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి పాల్గొని మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళల ఆర్థిక, సామాజిక ఎదుగుదలే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, మహిళలందరూ వీటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు యుగంధర్ రెడ్డి, స్వాతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు లక్ష్మణ్, విజయ్, విజయేందర్, ఉపేందర్, రేణుకలతో పాటు రిసోర్స్ పర్సన్స్ , స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్టేషన్ ఘనపూర్‌లో భూత్ స్థాయి అధికారులకు ఎస్ఐఆర్‌పై శిక్షణ



ఇది కద నిజం న్యూస్ స్టేషన్ ఘనపూర్, జూన్ 22

స్టేషన్ ఘనపూర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల భూత్ స్థాయి అధికారులు కోసం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్, స్టేషన్ ఘనపూర్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమంపై శిక్షణా తరగతి నిర్వహించారు.మాస్టర్ ట్రైనర్ రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన విధులు, సమాచార సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం భూత్ స్థాయి అధికారులకు అవసరమైన మెటీరియల్ బ్యాగులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో ఎస్. కిరణ్ ప్రకాష్, తహసీల్దార్ స్వప్న, మండల గిర్దావర్లు శ్రీకాంత్, సతీష్, గ్రామ జీపీఓలు మరియు ఇతర అధికారులు హాజరయ్యారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి భూత్ స్థాయి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అధికారులు సూచించారు.

# నాణ్యమైన విద్య అందిస్తున్న సంస్కృతి స్కూల్

**విద్యా రంగంలో సంస్కృతి స్కూల్ సేవలు ప్రశంసనీయం!**

**ఆధునిక సౌకర్యాలతో విద్యార్థులకు మెరుగైన వాతావరణం**

**అన్ని నిబంధనలను పాటిస్తున్నామని యాజమాన్యం స్పష్టం**

**విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన**




ఇది కద నిజం, నవాబుపేట్: వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సంస్కృతి స్కూల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి గుర్తింపు పొందుతోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఆధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. పాఠశాల నిర్వహణకు సంబంధించి అన్ని నిబంధనలను పాటిస్తున్నామని, సంబంధిత శాఖల మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ప్రక్రియలు కొనసాగుతున్నాయని స్కూల్ ప్రతినిధులు వెల్లడించారు. పాఠశాలపై వస్తున్న కొన్ని ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని, అవసరమైతే సంబంధిత అధికారులకు పూర్తి వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని యాజమాన్యం తెలిపింది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

# పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది

## శాసన మండలి సభ్యులు కోదండరాం



ఇది కద నిజం:సోమవారం నవాబ్ పెట్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించే మహోత్సవ కార్యక్రమాన్ని అక్షర చేయుత ట్రస్ట్ మరియు ఎస్. జైపాల్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు కోదండరాం, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, శాసనసభ్యులు కాలే యాదయ్య, అక్షర చేయుత ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి లు విచ్చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు వారితోషికం తో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి మన ఊరి పాఠశాలను ఆదర్శవంతంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడమే కాకుండా మధ్యాహ్నం నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు, ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే వారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకై ప్రభుత్వం ఎన్నో నిధులను ఇవ్వడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం జిల్లాలో 100 పూర్వ ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కేజీబీవీ, గురుకుల, ఆదర్శ పాఠశాలలతో పాటు వివిధ వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా అల్పాహారాన్ని కూడా అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిగమించడానికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతంమెరుగైన సౌకర్యాలైన ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, డిజిటల్ ఎడ్యుకేషన్ అందుబాటులోకి వచ్చిందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. తల్లిదండ్రులు పిల్లలను విద్య పట్ల మరింత ప్రోత్సాహాన్ని అందిస్తూ మంచి జీవితాన్ని అందించేందుకు తమ వంతు కృషి ఉండాలని కలెక్టర్ సూచించారు. స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ జిల్లాను ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గురుకుల, ఆదర్శ పాఠశాలలు నెలకొల్పడం వల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అందరూ పూర్తిస్థాయిలో విద్యను అభ్యసిస్తున్నారని ఆయన అన్నారు. 2010వ సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు జ్ఞాపికలను అందించి ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన అన్నారు. గతంలో మూడు దఫాలుగా ఎమ్మెల్సీగా ఉన్న యాదవ రెడ్డి అధిక నిధులను వెచ్చించి రోడ్ల సౌకర్యం కల్పించడంలో కృషి చేశారని అన్నారు. ప్రస్తుతం రోడ్ల అభివృద్ధికి 10 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, బల్వంత్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐఐఐటీలో సీటు సాధించిన సంకీర్తనకు ఘన సన్మానం



ఇది కద నిజం న్యూస్ జఫర్ఘడ్ జూన్ 22

జఫర్‌గడ్ మండలానికి చెందిన విద్యార్థిని బుర్ర సంకీర్తన పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించి మండలంలో సెకండ్ టాపర్‌గా నిలవడంతో పాటు ఐఐఐటి లో సీటు సాధించి ప్రతిభ చాటింది.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు బుర్ర తిరుపతి గౌడ్ కుమార్తె సంకీర్తనను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) అభినందించి సన్మానించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జనగామ జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తౌటి సురేష్ గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అబ్బరబోయిన యాక స్వామి, బూత్ అధ్యక్షులు సకినాల కొమురెల్లి, నర్సింగోజు స్వామి, వల్లాల శ్రీనివాస్, వార్డు సభ్యులు బైరి పవన్, నేరోళ్ళ రాజు, జిల్లా నారి శక్తి కేంద్ర ఇంచార్జ్ ముస్కు స్వప్న, పాలకుంట కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, సంకీర్తన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్‌లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం




ఇది కద నిజం న్యూస్, స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 22

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ వేణు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని వివరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించడం లేదా వినియోగించడం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని మంచి మార్గంలో నడిపించాలని సీఐ వేణు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలి -- ప్రైవేట్ ఫీజుల దోపిడిని అరికట్టాలి- రాపర్తి రాజు




స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 22 (ఇది కద నిజం)

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల సాధారణ, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, వివిధ పేర్లతో అదనపు వసూళ్లు పెరిగిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను ప్రభుత్వం అరికట్టి, ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరచి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పేద, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు.ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం ప్రజలు, తల్లిదండ్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఆయన, ఈ రోజు నుంచి వారం రోజుల పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, అధిక ఫీజులపై సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని వెల్లడించారు.సీపీఎం చేపట్టిన ఈ సర్వేకు ప్రజలు మద్దతు తెలుపుతూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, మండల కమిటీ సభ్యులు కత్తుల రాజు, మంద మహేందర్, చిలుముల్ల భాస్కర్, పోలాస్ పరమేష్, నాయకులు వంగపండ్ల సోమయ్య, దైద కుమార్, నీరటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నా

అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న లేటెస్ట్ సినిమా 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో రాబోతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్‌ప్రైజెస్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఇందులో అఖిల్, భాగ్యశ్రీతో పాటు సుదర్శన్, గెటప్ శ్రీను, బ్రహ్మాజీ కీలక పాత్రలో కనిపించనున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా పలు వాయిదాల తర్వాత జూలై 10న విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంలో.. తాజాగా, యాంకర్ సుమతో జరిగిన తాజా ఇంటర్వ్యూలో అఖిల్ పాల్గొని, సినిమా ఆలస్యం కావడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా విడుదల కోసం తాను ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నానని, ప్రస్తుతం తనపై తీవ్రమైన ఒత్తిడి ఉందని అఖిల్ ఓపెన్‌గా చెప్పారు. ఒక రకమైన టెన్షన్ అనుభవిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

ఈ ప్రాజెక్ట్ కోసం తాను ఎంతగానో శ్రమించానని, తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి భారీగా శ్రమను పెట్టుబడిగా పెట్టానని అఖిల్ వివరించారు. తాను పడ్డ కష్టాన్ని, చూపించిన శ్రద్ధను ప్రేక్షకులు ఖచ్చితంగా గుర్తిస్తారని, థియేటర్లలో సినిమా చూసి ఆదరిస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నట్లు ఆయన తెలిపారు. గతంలో వచ్చిన సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడక డిజాస్టర్లుగా మిగిలిపోవడంతో, ఈ సినిమా సక్సెస్ అఖిల్‌కు ఎంతో కీలకంగా మారింది. అయితే అఖిల్ కెరీర్‌లో 'లెనిన్' ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే, ఇప్పటివరకు స్టైలిష్, లవర్ బాయ్ లుక్స్‌లో కనిపించిన అఖిల్.. ఈ సినిమాలో మొదటిసారి ఒక ఊర మాస్, పల్లెటూరి నేపథ్యం ఉన్న రస్టిక్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇది ఆయన మునుపటి సినిమాల కంటే పూర్తిగా భిన్నంగా ఉండబోతోందని సమాచారం.

## బాలయ్య-కొరటాల మూవీకి ముహూర్తం





బాలకృష్ణ, స్టార్ దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు అధికారిక టైటిల్ ఖరారు కాకపోవడంతో 'NBK112' అనే వర్కింగ్ టైటిల్‌తో చిత్ర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ప్రారంభోత్సవ వేడుక వివరాలను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. జూన్ 25, 2026 ఉదయం 9 గంటల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వెంకటపాలెం టిటిడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ మరియు హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేష్, పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. "A Powerful Combo, An Exciting Beginning" అనే ట్యాగ్‌లైన్‌తో విడుదలైన పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల్లో సినిమాపై భారీ అంచనాలను పెంచుతోంది.

## అనిల్ రావిపూడి సినిమా పేరుతో భారీ మోసం




టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్‌గా పేరు తెచ్చుకున్న విక్టరీ వెంకటేష్ మరియు బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ #VenkyAnil5 (#NKRAR2). సాహు గారపాటి నిర్మాణంలో, జీవీ ప్రకాశ్ సంగీతంలో షైన్ స్క్రీన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, ఈ క్రేజ్ ఆసరాగా చేసుకుని చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాలనుకునే అమాయక యువతీ యువకులను బురిడీ కొట్టించడానికి కొందరు కేటుగాళ్లు రంగంలోకి దిగారు. ఈ సినిమా పేరుతో సోషల్ మీడియాలో సాగుతున్న ఒక పెద్ద మోసంపై చిత్ర యూనిట్ అధికారికంగా స్పందిస్తూ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.


SMT. ARCHANA PRESENTS SHINE SCREENS Z STUDIOS

⚠ నకిలీ కాస్టింగ్ కాల్ హెచ్చరిక ⚠

మా సినిమా పేరుతో ఒక నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియాలో మరియు ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది.

ఆ కాస్టింగ్ కాల్‌కు మా చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదు.

దయచేసి అలాంటి మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దు. మా సినిమా తరఫున కాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, పత్రాలు లేదా డబ్బు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేస్తున్నాము.

మా చిత్రానికి సంబంధించిన ఏవైనా అధికారిక కాస్టింగ్ ప్రకటనలు ఉంటే, అవి కేవలం మా అధికారిక మరియు ధృవీకరించబడిన సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారానే ప్రకటించబడతాయి.

జాగ్రత్తగా ఉండండి. మోసగాళ్ల బారిన పడవద్దు.

టీమ్
#VENKYANIL5
#NKRAR2
AN ANIL RAVIPUDI FILM
PRODUCED BY SAHU GARAPATI A GV PRAKASH MUSICAL

సినిమాలో నటించే అవకాశం ఉందంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు నకిలీ కాస్టింగ్ కాల్స్ నడుపుతున్నట్లు చిత్ర బృందం గమనించింది. దీనిపై ప్రొడక్షన్ హౌస్ అత్యంత వేగంగా స్పందిస్తూ ఒక అధికారిక నోట్‌ను విడుదల చేసింది. "మా సినిమా పేరుతో ఒక నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియా మరియు ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ కాస్టింగ్ కాల్‌కు మా చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదు" అని నిర్మాతలు తేల్చి చెప్పారు. సినిమాల్లో ఛాన్స్ కోసం ఎదురుచూసే వారి బలహీనతలను పెట్టుబడిగా మార్చుకుని, మోసగాళ్లు డబ్బులు వసూలు చేసే ప్రమాదం ఉందని టీమ్ హెచ్చరించింది. మా సినిమా తరఫున కాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న ఏ వ్యక్తికీ మీ వ్యక్తిగత వివరాలు, ఫోటోలు లేదా డాక్యుమెంట్స్ షేర్ చేయవద్దు. ఈ సినిమా ఆడిషన్స్ లేదా సెలెక్షన్ల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని, చిత్ర యూనిట్ రూపాయి కూడా ఆశించదని స్పష్టం చేశారు.

ఒకవేళ ఈ సినిమాకు సంబంధించి భవిష్యత్తులో ఏదైనా కాస్టింగ్ అవసరం ఉంటే, దానికి సంబంధించిన ప్రకటనలు కేవలం అధికారిక మరియు వెరిఫైడ్ సోషల్ మీడియా ఖాతాల ద్వారానే వస్తాయని మేకర్స్ స్పష్టం చేశారు. "జాగ్రత్తగా ఉండండి, మోసగాళ్ల బారిన పడవద్దు" అని చిత్ర బృందం సినిమా ఆస్పిరెంట్స్‌కు విజ్ఞప్తి చేస్తోంది. కాబట్టి సినీ అవకాశాల కోసం ప్రయత్నించే వారు ఇలాంటి ఫేక్ పోస్టుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండటం అవసరం.




## సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు

### జూలైన 6 విచారణ వాయిదా

హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనపై పోలీసులు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను నాంపల్లి కోర్టు పరిగణనలోకి తీసుకుని, విచారణను అధికారికంగా ప్రారంభించింది. అయితే, ఇదే కేసులో 12 మంది నిందితులతో పాటు ఇప్పటికే కోర్టు నుంచి నోటీసులు అందుకున్న హీరో అల్లు అర్జున్ సోమవారం విచారణకు హాజరుకావాల్సి ఉంది. కానీ, ముందే ఖరారైన ఒక సినిమా షూటింగ్ షెడ్యూల్ కారణంగా ఆయన ముంబైలో ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యక్తిగతంగా న్యాయమూర్తి ఎదుట విచారణకు హాజరుకాలేని పరిస్థితి నెలకొంది.

అయితే, గైర్హాజరుపై అల్లు అర్జున్ న్యాయవాదులు కోర్టులో ఓ కీలక పిటిషన్ దాఖలు చేశారు. ఇతర కారణాల వల్ల కోర్టు ఆన్‌లైన్ విచారణకు హాజరయ్యారు.. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ ఆబ్సెంట్ పిటిషన్ వేశారు. ముంబై షూటింగ్ షెడ్యూల్ కారణంగా ఆయన విచారణకు హాజరుకాలేకపోయారని, జూలైన 6 విచారణకు కూడా వర్చువల్‌గానే హాజరవుతారని అందులో కోర్టుకు వివరించినట్లుగా తెలుస్తోంది. దీంతో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు మెమో దాఖలు చేయాలని ఆదేశించింది.